సాక్షి

జయశంకర్ భూపాలపల్లి

శనివారం | 6 | జనవరి | 2024



కేయూలో ఏసీబీ కలకలం

కేయూలో ఏసీబీ అధికారుల దాడులు కలకలం రేపాయి. ఓ పాల వ్యాపారి వద్ద లంచం తీసుకుంటూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ పట్టుబడటం సంచలనం కలిగించింది.

- 8లో▸



మేడారంలో విస్తృత సేవలు

మేడారం జాతర సమయంలో వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ సేవలు మరింత విస్తృతం చేస్తామని జీఎం చంద్రమౌళి తెలిపారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం

$30.0^0/16.0^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం మంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఉష్ణోగ్రత మామూలుగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఉచిత శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

భూపాలపల్లి రూరల్: గ్రూపు 1, 2, 3, 4 ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ ఎంపీవీ ప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ఆసక్తిగల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల ఎంపిక విధానం రిజర్వేషన్, డిగ్రీ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఉంటుందని వివరించారు. వివరాలకు 0870-2571192, 040-24071178, 040-27077929 నంబర్లకు ఫోన్‌చేయాలని సూచించారు.

నేడు రామాలయంలో తులసి అర్చన

కాళేశ్వరం: ధనుర్మాసం పురస్కరించుకొని కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయ అనుబంధ దేవాలయమైన శ్రీరామాలయంలో 'ప్రత్యేక తులసి' అర్చన కార్యక్రమాన్ని శనివారం(నేడు) ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు ఈఓ మహేష్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తులసి పూజా కార్యక్రమానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదం స్వీకరించాలని ఆయన కోరారు.

సీసీఐ కొనుగోళ్ల నిలిపివేత

కాటారం: కాటారం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని రుద్ర జిన్నింగ్ మిల్లులో ఏర్పాటుచేసిన సీసీఐ కొనుగోలు కేంద్రంలో మూడు రోజుల పాటు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పెండ్యాల మమత, కార్యదర్శి షరీఫ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిన్నింగ్ మిల్లులో సీసీఐ కొనుగోలు చేసిన పత్తి నిల్వలు పెరిగిపోవడంతో స్థలం లేనందున కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. నేటినుంచి ఈ నెల 9వ తేదీ వరకు పత్తి కొనుగోళ్లు నిలిపివేస్తున్నట్లు చెప్పారు. 10వ తేదీ నుంచి తిరిగి కొనుగోళ్లు ప్రారంభించనున్నట్లు తెలిపారు. రైతులు సహకరించాలని కోరారు.

కస్తూర్బా పాఠశాల తనిఖీ



మల్హర్: మండలంలోని మల్లారం గ్రామపంచాయతీ పరిధి దబ్బగట్టు శివారులోని కస్తూర్బా గాంధీ పాఠశాలను జిల్లా సెక్టోరియల్ అధికారి కిషన్‌రావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈ సందర్భంగా కిషన్‌రావు పాఠశాలలో సౌకర్యాలు వంట గది, స్టోర్‌రూంలు, గదులు, బాత్రూం తదితర వాటిని పరిశీలించి ఆరాతీశారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పదవ తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఉపాధ్యాయినులు కృషి చేయాలని ఆదేశించారు.

జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సురేష్



మల్హర్: రేషన్ సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మల్హర్ మండలం తాడిచర్ల గ్రామానికి చెందిన బూడిద సురేష్ ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో సురేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహరించిన జిల్లా, రాష్ట్ర నాయకులకు ఈ సందర్భంగా సురేష్ కృతజ్ఞతలు తెలిపారు.

భార్గవికి గోల్డ్ మెడల్



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి పట్టణానికి చెందిన విద్యార్థిని బెల్లం భార్గవి జేఎన్‌టీయూహెచ్‌లో గోల్డ్‌మెడల్ సాధించారు. బెల్లం భార్గవి జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ హైదరాబాద్ (జేఎన్టీయూహెచ్) పరిధిలోని కళాశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి 2022–23 విద్యా సంవత్సరంలో ఎంబీఏలో రెండు గోల్డ్ మెడల్స్ సాధించారు. ఈ మేరకు హైదరాబాద్ క్యాంపస్‌లోని ఆడిటోరియంలో శుక్రవారం మెడల్స్ అందుకున్నారు. హైదరాబాద్ క్యాంపస్‌లో టాపర్‌గా నిలబడమే కాకుండా యూనివర్సిటీ పరిధిలో టాపర్‌గా నిలిచి రెండు మెడల్స్ సాధించారు. గోల్డ్ మెడల్స్‌ను ఇస్రో చైర్మన్ సోమనాథ్, వైస్ చాన్స్‌లర్ కట్టా నరసింహారెడ్డి అందజేశారు. గోల్డ్ మెడల్ అందుకున్న భార్గవిని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మేనేజ్మెంట్ హైదరాబాద్ హెడ్ ప్రొఫెసర్ సింధు, కళాశాల అధ్యాపకులు అభినందించారు.

వేతన వెతలు..



మున్సిపల్ సిబ్బందికి 3 నెలలుగా అందని జీతం

- పారిశుద్ధ్య కార్మికుల ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



భూపాలపల్లి అర్బన్: భూపాలపల్లి మున్సిపాలిటీ సిబ్బందికి మూడు నెలలుగా వేతనాలు రావడం లేదు. నవంబర్, డిసెంబర్ వేతనాలు చెల్లించకపోగా జనవరి మాసం ప్రారంభమై ఆరు రోజులు అవుతున్నా ఇప్పటివరకు వేతనాల ఊసే లేదు. దీంతో మున్సిపాలిటీలో పనిచేస్తున్న 154మంది కార్మికులు, సిబ్బంది రెండు నెలల నుంచి ఇబ్బందులు పడుతున్నారు.

పండగకు వస్తులేనా..

సంక్రాంతి పండగ మరో వారం రోజులు ఉంది. పండగ నేపథ్యంలో పిండి వంటలు, నిత్యావసర వస్తువులు, నూతన వస్త్రాలు కొనుగోలు చేసేందుకు కార్మికులు ఎదురు చూస్తున్నారు. జీతం వస్తే గానీ పండగ జరుపుకోలేని పరిస్థితులు దాపురించాయి. ప్రతీ పండగకు ముందు అధికారులు కార్మికులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

పట్టించుకోని అధికారులు..

కార్మికుల వేతనాలు సకాలంలో చెల్లించడంలో అధికారులు దృష్టి పెట్టనట్లు కనిపిస్తుంది. అధికారులు ఎస్టీఓ కార్యాలయానికి చెక్కులు పంపించి చేతులు దులుపుకున్నట్లు కనిపిస్తుంది. అధికారులు పట్టింపులేని పని తనంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. వేతనాల కోసం ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రతీ నెల మొదటి వారంలో వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు.

ఆదాయం సమకూరుస్తున్నది వారే..

మున్సిపాలిటీ పరిధిలో కావాల్సిన అన్ని రకాల పనులు చేపట్టి ప్రజలకు కావాల్సిన సౌకర్యాలు అందించేది మున్సిపాలిటీ కార్మికులు, సిబ్బంది మాత్రమే. పారిశుద్ధ్య కార్మికులు పట్టణాన్ని శుభ్రం చేయడం, బిల్ కలెక్టర్లు పన్నులు వసూలు చేయడం, ఇతర నిర్మాణాల అనుమతులు, ఇంటి నంబర్లు ఇవ్వడంలో కార్యాలయంలో పనిచేసే సిబ్బంది ముందుంటారు. వారి ద్వారా వచ్చే ఆదాయంలో నుంచి వేతనాలు చెల్లించాల్సి ఉంటుంది.

సాకులు చెబుతూ..

వేతనాలు చెల్లించాలని కార్మికులు ప్రతి రోజు అధికారులను అడుగుతున్నారు. దీంతో అధికారులు కాలం వెళ్లదీసే ప్రయత్నం చేస్తున్నారు. రెండు నెలల బిల్లులు ఎస్టీఓ కార్యాలయానికి పంపించామని, హైదరాబాద్ నుంచి అప్రోవల్ రావడం లేదంటున్నారు. ప్రతి సారి రెండు, మూడు రోజుల్లో వేతనాలు వస్తాయంటున్నారని కార్మికులు ఆవేదన చెందుతున్నారు.

అప్పులు చేసి కుటుంబాలను నెట్టుకొస్తూ..

మున్సిపాలిటీ కార్మికులకు వచ్చే వేతనాలే తక్కువ. ఈ తక్కువ వేతనాలు ప్రతీ నెలా చెల్లించకపోవడంతో కుటుంబాల జీవనం ఇబ్బందికరంగా మారుతుంది. ప్రతీ నెల అప్పులు చేసి కుటుంబాలను వెళ్లదీస్తున్నారు. ఇంట్లో నిత్యావసర వస్తువులు, పిల్లలకు పాఠశాలల ఫీజులు కట్టడం కోసం అప్పులు చేయకతప్పడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

మూడు నాలుగు రోజుల్లో జమ..



కార్మికులకు రావాల్సిన వేతనాల బిల్లులు ఎస్టీఓ కార్యాలయంలో అందజేశాం. ఎస్టీఓ ద్వారా వేతనాలు ఆలస్యం అవుతున్నది వాస్తవమే. మరో మూడు నాలుగు రోజుల్లో వేతనాలు చెల్లించేలా ఏర్పాట్లు చేస్తాం.

– అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ కమిషనర్



విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

డ్రగ్స్‌తో జీవితాలు నాశనం చేసుకోవద్దు



అంబేడ్కర్ సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

అదనపు ఎస్పీ నరేష్‌కుమార్

భూపాలపల్లి అర్బన్: విద్యార్థులు, యువకులు డ్రగ్స్ బారినపడి జీవితాలను నాశనం చేసుకోవద్దని అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ అన్నారు. భూపాలపల్లి డీఎస్పీ రాములు ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో జూనియర్ కళాశాల, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. యాంటీ డ్రగ్స్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ నరేష్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ.. విద్యార్థులు చెడు మార్గాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ బారిన పడి ఎంతో మంది జీవితాలు దుర్భరం అయ్యాయని చెప్పారు. వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. ఎక్కడైనా డ్రగ్స్ విషయం తెలిసిన తక్షణమే పోలీసులకు సమాచారం ఇస్తే తప్పక చర్యలు తీసుకుంటామని చెప్పారు. విద్యార్థులు కూడా తమ తల్లిదండ్రుల కష్టాలు గుర్తుపెట్టుకుని క్రమశిక్షణతో చదువుకుంటూ కళాశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి, ఎస్ఐలు సంధ్యారాణి, శ్రీలత, శ్రావణ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతర పనులు త్వరగా పూర్తి చేయాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

ఎస్ఎస్‌తాడ్వాయి: మేడారం జాతర పనులన్నీ త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సంబంధిత అధికారులను ఆదేశించారు. జాతర ఏర్పాట్లలో భాగంగా పస్రా- భూపాలపల్లి, పస్రా-మేడారం వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో శుక్రవారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ఐటీడీఏ పీఓ అంకిత్‌తో కలిసి మేడారం ఐటీడీఏ గెస్ట్ హౌస్ వెనుకాల ఉన్న పార్కింగ్ స్థలం, చిలకల గుట్ట వద్ద పార్కింగ్ స్థలాన్ని పరిశీలించారు. వీవీఐపీ, వీఐపీ పార్కింగ్ స్థలాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. పోలీస్, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులతో సమన్వయంతో ఫిబ్రవరి మొదటి వారంలోగా పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వసంతరావు, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, ఆర్‌అండ్‌బీ డీఈ రఘువీర్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారం అందించాలి

ములుగు రూరల్: అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే లబ్ధిదారులకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం మండలంలోని జగ్గన్నపేటలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ అంగన్‌వాడీ కేంద్రంలోని మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు. సెంటర్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ పి.నాగపద్మజ, జిల్లా సంక్షేమ అధికారిణి ప్రేమలత, సర్పంచ్, ఐసీడీఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

- అధికారులు నిర్లక్ష్యం వీడాలి
- ఎమ్మెల్యే సత్యనారాయణరావు ఆగ్రహం



సమావేశంలో పాల్గొన్న కౌన్సిల్ సభ్యులు, అధికారులు

భూపాలపల్లి రూరల్: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి మున్సిపల్ అభివృద్ధికి పాటు పడాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సూచించారు. భూపాలపల్లి మున్సిపల్ సర్వసభ్య సమావేశం చైర్‌పర్సన్ సెగ్గం వెంకటరాణి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగింది. ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గత సమావేశం ఎజెండా, పనుల వివరాలు, మిషన్ భగీరథ తదితర పనుల పెండింగ్‌పై సభ్యులు అధికారులను నిలదీశారు. అధికారులు సమాధానం చెప్పకపోవడంతో కమిషనర్‌పై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు. వారంలోగా మిషన్ భగీరథ పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. జాతీయ రహదారి పనులు నాణ్యత లోపించకుండా చూడాలన్నారు. 58, 59 జీవో ద్వారా దరఖాస్తులు చేసుకున్న వారికి రెగ్యూలర్ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మున్సిపాలిటీలో శానిటేషన్‌పై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. సీఎస్సార్, డీఎంఎఫ్టీ నిధులను మున్సిపాలిటీ అభివృద్ధి కోసమే ఖర్చు చేయాలని చెప్పారు. మరోసారి జరిగే మున్సిపల్ సమావేశానికి జిల్లాస్థాయి అధికారులు పాల్గొనే విధంగా సమాచారం అందించాలన్నారు. సమావేశానికి హాజరుకాని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రానున్న రోజుల్లో మున్సిపాలిటీని విస్తరించే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గండ్ర హరీశ్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆన్‌లైన్ చేయాలి

- నేటినుంచి డేటా ఎంట్రీ ప్రక్రియ ప్రారంభం
- కలెక్టర్ భవేష్‌మిశ్రా





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, హాజరైన అధికారులు, సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: ప్రజల నమ్మకాన్ని నిలబెట్టేలా ప్రజాపాలన దరఖాస్తులు కట్టుదిట్టంగా ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేయాలని కలెక్టర్ భవేష్‌మిశ్రా ఆదేశించారు. ప్రజాపాలన దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసే అంశంపై శుక్రవారం కలెక్టర్ భవేష్‌మిశ్రా సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో డేటా ఎంట్రీ ఆపరేటర్లకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ భవేష్‌మిశ్రా మాట్లాడుతూ.. జిల్లాలో ప్రతిరోజు 20వేల వరకు ప్రజా పాలన దరఖాస్తులు వస్తున్నాయన్నారు. శనివారం వరకు సుమారు 1.40 లక్షల దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. వాటిని ప్రభుత్వం రూపొందించిన ఆన్‌లైన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని చెప్పారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదుచేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక పోర్టల్ రూపొందించిందని చెప్పారు. మండలాల వారీగా వచ్చిన దరఖాస్తులను డేటా ఎంట్రీ ఆపరేటర్‌లు ఆన్‌లైన్ ప్రజాపాలన వెబ్‌సైట్‌లో నమోదుచేయాలని సూచించారు. ప్రభుత్వంపై నమ్మకంతో ప్రజలు ప్రజాపాలన కార్యక్రమానికి వచ్చి తమ దరఖాస్తులు సమర్పించారని చెప్పారు. అర్హులైన ప్రజలకు ప్రభుత్వ పథకాలు అందించేందుకు సదరు దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేయడం చాలా కీలకమన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకునే దిశగా డేటా ఎంట్రీ ఆపరేటర్లు దరఖాస్తుదారుల వివరాలను ఎలాంటి చిన్న పొరపాటు కూడా లేకుండా ఆన్‌లైన్‌లో భద్రపరచాలన్నారు. ప్రజాపాలన.తెలంగాణ.గౌ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి దరఖాస్తుదారుల వివరాలు అసంపూర్తిగా ఉంటే వెంటనే సంబంధిత ఎంపీడీఓ లేదా తహసీల్దార్‌కు సమాచారం అందించాలని, దరఖాస్తుదారుల నుంచి అసంపూర్తిగా ఉన్న సమాచారం సేకరించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని ఎట్టి పరిస్థితుల్లో దరఖాస్తులను తిరస్కరించడానికి వీలులేదన్నారు. ప్రతి ప్రైవేట్ ఆపరేటర్‌కు ఒక దరఖాస్తుకు 15 రూపాయలు, ప్రభుత్వ ఆపరేటర్‌కు 5 రూపాయలు అందించనున్నట్లు చెప్పారు. గోరికొత్తపల్లి నూతన మండలంగా ఏర్పడ్డ నేపథ్యంలో ఉద్యోగుల కొరత ఉన్నందున రేగొండలో కలిపినట్లు తెలిపారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ వెంట పంచాయతీ సెక్రటరీ లేదా మరో ఉద్యోగి తప్పకుండా ఉండాలనీ, ఆపరేటర్‌కు ఇచ్చిన అప్లికేషన్లు రికార్డు చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, మండల ప్రత్యేకాధికారులు, ఎంపీడీఓలు, తహసీల్దార్లు, పంచాయతీ సెక్రటరీలు పాల్గొన్నారు.

వైద్యారోగ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలో వైద్యారోగ్యశాఖ కార్యక్రమాలను విస్తృతం చేయాలని డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్ అన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో శుక్రవారం వైద్యాధికారులు, ప్రోగ్రాం అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ మాట్లాడుతూ.. ప్రతీ నెల జన ఆరోగ్య సమితి సమావేశాలు నిర్వహించాలని, కమిటీలో చర్చించాల్సిన విషయాలు, కమిటీ సభ్యులకు వివరించారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ప్రతీ నెల మందులు అందించాలన్నారు. అన్ని వివరాలు ఆన్‌లైన్ చేయాలని చెప్పారు. మాతా శిశు సంరక్షణ, చిన్నపిల్లలకు టీకాలు, క్షయ వ్యాధి నిర్మూలన, సీజనల్ వ్యాధుల గురించి అడిగి పీహెచ్‌సీల వారీగా తెలుసుకున్నారు. ప్రతి ప్రోగ్రాం వంద శాతం విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ కొమురయ్య, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ శ్రీదేవి, ఉమాదేవి, అన్వేషిని, డీపీఓ చిరంజీవి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీదేవి, సిబ్బంది పాల్గొన్నారు.


మెరుగైన వైద్యసేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న క్రాంతికుమార్

ఏటూరునాగారం: గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్ఓ క్రాంతికుమార్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలోని చాంబర్‌లో ఐటీడీఏ కింద ఉన్న 17 పీహెచ్‌సీల పరిధిలో ఎపిడెమిక్, ఎంసీహెచ్ టీంలతో సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో పర్యటనలకు ముందు నెల రోజుల ప్లాన్ సిద్ధం చేసుకోవాలన్నారు. రోజులో ఒకటి, రెండు శిబిరాలను ఏర్పాటు చేయాలని, మారుమూల అటవీ గ్రామాల్లోని గర్భిణులు డెలవరీ సమయం కంటే ముందే ఆస్పత్రికి చేర్చాలన్నారు. హాజరు రిజిష్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను రాయాలని, మెడికల్ క్యాంపు సమయాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉండేవిదంగా చూసుకోవాలన్నారు. ఏఎన్ఎంలు, ఆశకార్యకర్తలు ఇంటింటి సర్వేలు చేపట్టి రోగులను గుర్తించాలన్నారు.

హక్కుల సాధనకు ఉద్యమించాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఎస్ఎస్‌తాడ్వాయి: హక్కుల సాధనకు ఆదివాసీలు సంఘటితంగా మలిదశ ఉద్యమాలకు సిద్ధమవ్వాలని తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మైపతి అరుణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలకేంద్రంలో జిల్లా అధ్యక్షుడు కొరగట్ల లక్ష్మణ్‌రావు అధ్యక్షతన ఏర్పాటు చేసిన తుడుందెబ్బ జిల్లా స్థాయి సమావేశానికి మైపతి అరుణ్‌కుమార్ హాజరై మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో లంబాడీల సమస్యతో ఆదివాసీలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. లంబాడీల తొలగింపు దిశగా ఆదివాసీలు పోరాడాలన్నారు. ఐదో షెడ్యూల్ ప్రాంతంలో ఐటీడీఏల ద్వారానే ఉద్యోగాలు భర్తీ చేయాలన్నారు. షెడ్యూల్ ప్రాంతంలో జీఓ 317ను రద్దు చేయాలని, 29 శాఖల జీఓలను చట్టం చేయాలన్నారు. లేదంటే ప్రభుత్వంపై పోరాడుతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ములుగు డివిజన్ కమిటీ, తాడ్వాయి మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నల్లెబోయిన లక్ష్మణ్‌రావు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పుల రవి, ప్రచార కార్యదర్శి ప్రభాకర్, కార్యదర్శులు పాల్గొన్నారు.

పుట్టిన గ్రామం రుణం తీర్చుకుంటా..

- ఢిల్లీకి రాజైనా..తల్లికి బిడ్డనే..
- పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క
- తల్లిదండ్రుల దీవెనలు తీసుకున్న సీతక్క



సీతక్కకు స్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

ములుగు/ములుగురూరల్: పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తొలిసారిగా తన స్వగ్రామం జగ్గన్నపేటకు వచ్చిన మంత్రి సీతక్కకు గ్రామస్తులు, అభిమానులు శుక్రవారం ఘన స్వాగతం పలికారు. గ్రామ పొలిమేరలో పెద్ద ఎత్తున ఎదురేగి మంగళ హారతులతో ఘనస్వాగతం పలికి పూల వర్షం కురిపిస్తూ గ్రామంలోకి ఆహ్వానించారు. అనంతరం మంత్రి సీతక్కకు శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులను ఉద్దేశించి మంత్రి సీతక్క మాట్లాడుతూ తనపై చూపుతున్న ప్రేమానురాగాలను తాను ఎప్పటికీ మరిచిపోలేనన్నారు. అందరి సహకారంతోనే ఈ స్థాయికి ఎదిగానన్నారు. తాను పుట్టిపెరిగిన గ్రామాన్ని అన్నివిధాలుగా అభివృద్ధి చేసే బాధ్యత తనపై ఉందన్నారు. ప్రజలు తనపై పెట్టిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా ములుగు ప్రాంతాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవాలని, ఒక వేల ఇప్పటివరకు ఎవరైనా దరఖాస్తు చేసుకోలేని వారు ఉంటే వెంటనే చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందేలా చూస్తానని మంత్రి సీతక్క తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కూచన రవళీరెడ్డి, ములుగు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మల్లాడి రాంరెడ్డి, యువజన కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి సూర్య, కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు గొల్లపెల్లి రాజేందర్‌గౌడ్, కార్యదర్శి నూనేటి శ్యామ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు భానోత్ రవిచందర్, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు రేగ కల్యాణి, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దైవ దర్శనానికి వెళ్తూ వ్యక్తి మృతి

- భద్రాచలం వెళ్తుండగా ప్రమాదం
- అయ్యప్పమాలలో కుమారులు


అంజయ్య మృతదేహం

గార్ల: భద్రాద్రి రాముడిని దర్శించుకునేందుకు కాలినడకన వెళ్తున్న ఓ వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన ఘటన శుక్రవారం మానుకోట జిల్లా గార్ల మండలంలోని కొత్తపోచారం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తపోచారం గ్రామానికి చెందిన మలీదు అంజయ్య (56) కాలినడకన భద్రాచలం బయల్దేరాడు. అంజయ్య ఇద్దరు కుమారులు కోటేష్, వెంకటేష్ అయ్యప్పమాల ధరించి గత 6రోజుల క్రితం శబరిమలై వెళ్లారు. కుమారులు ఇద్దరు శబరిమలై వెళ్లి వచ్చేలోగా భద్రాచలం వెళ్లి మొక్కులు తీర్చుకొని వస్తానని ఇంట్లో భార్యకు చెప్పిన అంజయ్య.. ఈనెల 3వ తేదీన ఇంటి నుంచి కాలినడకన బయల్దేరాడు. 4వ తేదీ రాత్రి పాల్వంచ సమీపంలోని పెద్దమ్మతల్లి దేవాలయంలో బస చేశాడు. ఆ సమయంలో భార్యతో ఫోన్లో మాట్లాడి పెద్దమ్మతల్లి దేవాలయంలో పడుకున్నానని చెప్పాడు. తెల్లవారుజామున కాలినడక తన ప్రయాణం ప్రారంభించాడు. ఈక్రమంలో జగన్నాథపురం సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టడంతో అంజయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ఉదయం 6గంటలకు భార్య ఫోన్ చేయగా అంజయ్య ఫోన్ లిఫ్ట్ చేయలేదు. గంట తర్వాత మళ్లీ ఫోన్ చేయడంతో ఓ వ్యక్తి ఫోన్ తీసి అంజయ్య రోడ్డుపై చనిపోయి ఉన్నాడని చెప్పాడు. ఈక్రమంలో పాల్వంచ పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించిన అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. తండ్రి చనిపోయిన విషయం తెలుసుకున్న కుమారులు శబరిమలై నుంచి బయలుదేరినట్లు గ్రామస్తులు తెలిపారు.

అభివృద్ధి పనులపై దృష్టి సారించండి


బొగత వద్ద సిబ్బందితో మాట్లాడుతున్న సీసీఎఫ్ శాంతారామ్

వాజేడు: బొగత జలపాతం వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టి సారించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ అధికారి శాంతారామ్ సిబ్బందికి సూచించారు. ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని బొగత జలపాతాన్ని శుక్రవారం ఆయన ఎఫ్‌డీఓ అగర్వాల్‌తో కలిసి సందర్శించారు. జలపాతం వద్ద ఉన్న సమస్య, చేపట్టాల్సిన అభివృద్ధి వివరాలను తెలుసుకున్నారు. బొగతకు వచ్చే పర్యాటకుల సంఖ్య పెరిగేలా చర్యలను తీసుకోవాలని చెప్పారు. ఆయన వెంట రేంజర్ చంద్రమౌళి, సిబ్బంది ఉన్నారు.

కేయూలో ఏసీబీ కలకలం

పాలవ్యాపారి వద్ద రూ.50వేల లంచం డిమాండ్

- అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య బాగోతం
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ అధికారులు


కిష్టయ్య (వృత్తంలోని వ్యక్తి) ను విచారిస్తున్న ఏసీబీ అధికారులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో ఏసీబీ అధికారుల దాడులు శుక్రవారం కలకలం రేపాయి. యూనివర్సిటీ చరిత్రలో క్యాంపస్‌లోకి తొలిసారిగా ఏసీబీ అధికారులు అడుగుపెట్టారు. యూనివర్సిటీలోని కొందరు అవినీతి అధికారులపై పలు ఫిర్యాదులున్నా.. ఏసీబీ దాకా వెళ్లలేదు. తాజాగా ఓ పాలవ్యాపారి తన బిల్లు కోసం లంచం డిమాండ్ చేసిన అధికారిపై ఫిర్యాదు చేయడం.. అయనను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడం సంచలనం సృష్టించింది. యూనివర్సిటీలోని ఆడిట్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య శుక్రవారం పాలవ్యాపారి వద్ద రూ.50వేల లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడటం సంచలనం కలిగించింది. కిష్టయ్య లంచం తీసుకుంటుండగా హనుమకొండ ఏసీబీ అధికారి సాంబయ్య పలువురు ఇన్‌స్పెక్టర్లు ఇతర సిబ్బందితో కలిసి పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్‌లోని కాశిబుగ్గకు చెందిన పాలవ్యాపారి పెండెం రాజేందర్ సుమారు నాలుగు సంవత్సరాలుగా కాకతీయ యూనివర్సిటీలోని నాలుగు హాస్టళ్లకు సంబంధించిన మెస్‌లకు పాలు సరఫరా చేస్తున్నాడు. కొన్నినెలల పాల బిల్లు రూ.19లక్షలు హాస్టల్ ఆఫీస్ నుంచి చెల్లించాల్సి ఉంది. ఈక్రమంలో హాస్టల్ ఆఫీస్‌లో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా.. ఆడిట్ ఆఫీస్ లోనూ కిష్టయ్య బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. దీంతో బిల్లు పాస్ చేసేందుకు పాలవ్యాపారి రాజేందర్ నుంచి రూ.75వేల లంచం డిమాండ్ చేశాడు. తాను లంచం ఇచ్చుకోలేనని బిల్లు పాస్ చేయాలనికోరగా మా సారుకు కూడా ఇవ్వాల్సి ఉంటుందని.. ఇస్తేనే బిల్లు పాస్ చేస్తానని చెప్పడంతో చివరికి రూ.50వేలు ఇచ్చేందుకు రాజేందర్ అంగీకరించాడు. దీంతో 2023 డిసెంబర్ 31న బిల్లుకు సంబంధించిన రూ.14లక్షలు రాజేందర్ అకౌంట్‌కు పంపించారు. అనంతరం తనకు ఇస్తానన్న రూ.50వేలు ఇవ్వాలని కిష్టయ్య అడగడంతో లంచం ఇవ్వడం ఇష్టంలేని రాజేందర్.. ఏసీబీ అధికారులు ఆశ్రయించాడు. ఈక్రమంలో శుక్రవారం కేయూ ఆడిట్ ఆఫీస్‌లో విధి నిర్వహణలో ఉన్న కిష్టయ్య.. పాలవ్యాపారి రాజేందర్ నుంచి రూ.50వేలు తీసుకుంటుండగా.. ఏసీబీ అధికారి సాంబయ్య ఆధ్వర్యంలో పలువురు ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. పాలవ్యాపారి పెండెం రాజేందర్‌కు బిల్లు చెల్లించేందుకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్య రూ.50వేలు డిమాండ్ చేసి, వేధించారని బాధితుడు ఇచ్చిన సమాచారం మేరకు కిష్టయ్య డబ్బులు తీసుకుంటుండగా.. రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నట్లు వివరించారు. పంచనామా జరిపి కిష్టయ్యను అరెస్టు చేస్తున్నట్లు తెలిపారు. ఇదిలా ఉండగా.. కాకతీయ యూనివర్సిటీలోని హాస్టళ్ల ఆఫీస్‌లో కూడా ఏసీబీ ఇన్‌స్పెక్టర్ ఒకరు రికార్డులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. కేయూ హాస్టళ్ల డైరెక్టర్ ఆచార్య వెంకయ్య సమక్షంలో విచారణ చేపట్టడంతోపాటు, రికార్డులు పరిశీలిస్తున్నట్లు తెలిసింది.


పట్టుబడిన డబ్బు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీబీ డీఎస్పీ

కేయూ చరిత్రలో మొదటిసారి

యూనివర్సిటీ చరిత్రలో ఓ అసిస్టెంట్ రిజిస్ట్రార్(ఉద్యోగి) ఏసీబీకి పట్టుబడటం తొలిసారి కావటం సంచలనం కలిగించింది. ఈఘటనతో అవకతవకలకు పాల్పడేవారి గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. కిష్టయ్య ఏసీబీకి పట్టుబడ్డారని తెలుసుకున్న ఉద్యోగులు పరిపాలనాభవనం వైపు పరిశీలించి ఏం జరిగిందనేది తెలుసుకుని వెళ్తున్నారు. కొందరైతే యూనివర్సిటీ బయటికి వెళ్లిపోయారు. కిష్టయ్యకు అనుచరవర్గంగా ఉన్నవారు కిష్టయ్య గతంలో పనిచేసిన కళాశాల నుంచి వచ్చి వివరాలపై ఆరా తీయడం గమనార్హం.

డబ్బులు ఇస్తేనే బిల్లు పాస్ చేస్తానన్నాడు



కేయూలోని నాలుగు హాస్టళ్ల(మెస్)కు కొంత కాలంగా పాలు సరఫరా చేస్తున్నాను. రూ.19లక్షల బిల్లు చెల్లించేందుకు కిష్టయ్య రూ.75వేలు లంచం అడిగాడు. ముందుగా బిల్లుచెల్లిస్తే రూ.50వేలు ఇస్తానన్నాను. దీంతో 2023 డిసెంబర్ 31న రూ.14లక్షలు చెల్లించాడు. నాటినుంచి తనకు ఇస్తానన్న రూ.50వేల కోసం ఫోన్ చేస్తున్నాడు. లంచం ఇవ్వడం ఇష్టంలేక ఏసీబీని ఆశ్రయించా. కేయూ ఆడిట్ ఆఫీస్‌లో విధి నిర్వహణలోనే నా వద్ద రూ.50వేలు లంచం తీసుకున్నాడు. దీంతో ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

– పెండెం రాజేందర్, పాలవ్యాపారి

ఏఆర్ కిష్టయ్య అరెస్ట్

యూనివర్సిటీలో మిల్క్ డిస్ట్రిబ్యూటర్ పెండెం రాజేందర్‌కు పాల బిల్లు చెల్లించేందుకు రూ.50వేలు లంచం తీసుకున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్ కిష్టయ్యను అరెస్ట్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. తమకు అందిన ఫిర్యాదు మేరకు శుక్రవారం 11–48గంటలకు కేయూలోని ఆడిట్ బ్రాంచిలో ఏఆర్ కిష్టయ్య.. రాజేందర్ నుంచి రూ.50వేలు తీసుకోగా పట్టుకున్నామని తెలిపారు. కిష్టయ్య నుంచి రూ.50వేలు రికవరీ చేసి, అరెస్టు చేశామని వెల్లడించారు. విచారణ కొనసాగుతుందని పేర్కొన్నారు.

అవినీతి అధికారులపై చర్య తీసుకోవాలి

- అకుట్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో కీలక సెక్షన్లలో అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న కిష్టయ్య లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు పట్టుబడడం యూనివర్సిటీలో జరుగుతున్న అవినీతి అక్రమాలకు నిదర్శనమని ఇటువంటి వారి వెనుక ఉన్న అధికారులపై చర్యలు తీసుకునేలా విచారణ జరపాలని అసోసియేషన్ ఆఫ్ కాకతీయ యూనివర్సిటీ టీచర్స్ (అకుట్) శుక్రవారం డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా అకుట్ అధ్యక్ష కార్యదర్శులు ప్రొఫెసర్ శ్రీనివాస్, డాక్టర్ మామిడాల ఇస్తారి మాట్లాడుతూ.. కేయూలో నాలుగు ముఖ్యమైన విభాగాలకు ఒక్కరినే అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా నియమించడంలో ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. టీచర్ల అరియర్స్, ఎచ్.ఆర్.ఏ, డీ.ఏ, పదోన్నతి ఎరియర్స్ కూడా ఇవ్వకుండా అవినీతి అక్రమాలకు పాల్పడడం సిగ్గు చేటన్నారు. అధ్యాపకుల వేతనాల్లో భాగమైన జీపీఎఫ్ కూడా ఇవ్వకపోవడంపై టీచర్లు వీసీ, రిజిస్ట్రార్‌ల పాలనపై అసహనం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. అసమర్థ వీసీ, రిజిస్ట్రార్‌ల వల్ల వర్సిటీలో సమస్యలు పెరిగిపోతున్నాయన్నారు. యూనివర్సిటీలో అక్రమ నియామకాలు చేపడుతూ టీచర్లపై కక్ష పూరిత చర్యలకు పూనుకుంటున్నారని అకుట్ ఎప్పటినుంచో ఫిర్యాదు చేస్తుందన్నారు. ఇటీవల రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ ప్రిన్సిపాల్ సెక్రెటరీకి కూడా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇటువంటి అవినీతి అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అకుట్ కోరినట్లు పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా టీచింగ్, నాన్–టీచింగ్‌ల బదిలీలు, డిపార్ట్‌మెంటల్ కమిటీలు, సెలెక్షన్ కమిటీలు లేకుండానే నియామకాలు చేపడుతూ కేయూ అధికారులు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ప్రజాధనాన్ని వృథా చేస్తూ పాలన కొనసాగిస్తున్నారని విచారణ జరిపి ప్రజాధనాన్ని కాపాడాల్సిన అవసరం ఉందన్నారు.

తల్లిని చంపిన మతిస్థిమితం లేని కొడుకు

- రోకలిబండతో తలపై మోదీ ఘాతుకం
- అడ్డువచ్చిన మరో మహిళపై దాడి.. నిందితుడి పరారీ
- చిన్నకోడెపాకలో అనుమానాస్పదంగా సంచరించగా చెట్టుకు కట్టేసిన గ్రామస్తులు


రాజిరెడ్డిని కట్టేసిన గ్రామస్తులు


హైమావతి(ఫైల్)

రేగొండ: మానసికస్థితి సరిగా లేని కుమారుడు.. కన్న తల్లిని రోకలిబండతో మోది చంపాడు. అడ్డువచ్చిన మరో మహిళపై దాడి చేయడంతో ఆమె ప్రాణపాయస్థితిలో ఉంది. ఈ ఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా, రేగొండ మండలం తిరుమలగిరిలో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తిరుమలగిరి గ్రామానికి చెందిన కంచరకుంట్ల హైమావతి(60) కుమారుడు రాజిరెడ్డి కొన్నాళ్లుగా మానసికస్థితి సరిగా లేకపోవడంతో వింతగా ప్రవర్తిస్తూ కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతని ప్రవర్తన తట్టుకోలేక తల్లి హైమావతి, భార్య సరిత పక్కింట్లో నిద్రిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రాత్రి కూడా పక్కింట్లో నిద్రించిన తల్లి, భార్యను ఇంటికి రావాలని ఒత్తిడి చేశాడు. దీంతో వారు ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో రాజిరెడ్డి.. తల్లి హైమావతి తలపై రోకలబండతో మోదడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే చనిపోయింది. ఈ ఘటన చూసిన రాజిరెడ్డి భార్య సరిత భయంతో కేకలు వేయడంతో సమీప బంధువైన ఊకంటి తిరుపతమ్మ అక్కడికి వచ్చింది. ఆమెపై సైతం రాజిరెడ్డి దాడి చేశాడు. ఎవరైనా ఇక్కడికి వస్తే చంపేస్తానంటూ భయానక వాతావరణాన్ని సృష్టించి పారిపోయాడు. తీవ్రంగా గాయపడ్డ తిరుపతమ్మను గ్రామస్తులు చికిత్స నిమిత్తం 108లో హైదరాబాద్‌కు తరలించారు. డీఎస్పీ రాములు, సీఐ వేణుచందర్, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. పారిపోయిన రాజిరెడ్డి శుక్రవారం ఉదయం కొత్తపల్లిగోరి మండలం చిన్నకోడెపాకలో అనుమానాస్పదంగా సంచరించడంతో దొంగగా భావించిన గ్రామస్తులు చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. అప్పటికే చిట్యాల సీఐ దాసారపు వేణుచందర్ ఆధ్వర్యంలో రేగొండ ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి పలు గ్రామాల ప్రజల సహాయంతో నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. గ్రామానికి చేరుకుని చూడగా తల్లిని హత్య చేసి పారిపోయిన వ్యక్తిగా గుర్తించారు. మృతురాలి సోదరుడు మల్లారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

మేడారంలో విస్తృత సేవలు

- బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం చంద్రమౌళి

ఏటూరునాగారం: మేడారం జాతర సమయంలో వినియోగదారులకు బీఎస్ఎన్ఎల్ సేవలను మరింత విస్తృతం చేస్తామని బీఎస్ఎన్ఎల్ జీఎం చంద్రమౌళి అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం, ఏటూరునాగారంలోని బీఎస్ఎన్ఎల్ టవర్లు, కేబుల్ ఆపరేటర్లతో ఆయన సమావేశం నిర్వహించిన అంతరం మాట్లాడారు. భక్తులకు మరిన్ని సేవలు అందించడానికి శాశ్వత టవర్లతోపాటుగా నూతనంగా మరో 9 టవర్లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 4జీ సేవల కోసం కావాల్సిన ఏర్పాట్లు చేస్తామన్నారు. బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సేవలను లోకల్ కేబుల్ ఆపరేటర్ల ద్వారా ఇచ్చేందుకు చర్యలు చేపట్టామని పేర్కొన్నారు. వినియోగదారులకు సంస్థ ఆఫర్లను కూడా అందిస్తోందని వివరించారు. తమ ఇంటర్నెట్‌ను తీసుకొని 50శాతం భాగస్వామ్యంతో కనెక్షన్‌లు ఇచ్చుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కస్టమర్లకు మరింత సేవలను అందుబాటులోకి తీసుకురావడానికి తగిన ఏర్పాట్లు చేశామన్నారు. మారుమూల గ్రామాల్లో సైతం సెల్ టవర్లను నిర్మిస్తున్నట్లు ఆయన వెల్లడించారు. అలాగే ఏటూరునాగారంలో ఉన్న టవర్ వద్ద పటిష్టమైన ప్రహరీ, భద్రత ఉండాలన్నారు. కార్యక్రమంలో డీజీఎం విజయ్‌భాస్కర్‌రెడ్డి, ఏజీఎం సురేష్, డీఈ వసంత్‌కుమార్, ఎస్‌డీఈ నర్సింహమూర్తి, జేటీఓ రాధాకృష్ణతోపాటు కేబుల్ టీవీ ఆపరేటర్లు చెన్న భిక్షపతి, అలువాల శ్రీనివాస్, ఏపీఎం నెట్ యజమాని అల్లి వేణుమాధవ్, బోడ వెంకటస్వామి, చెన్న రమేష్, చారి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- మంత్రి పొన్నం ప్రభాకర్


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

ఎల్కతుర్తి: గత పదేళ్లుగా అభివృద్ధికి నోచుకోక వెనుకబడిన గ్రామాల్లో సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేస్తానని రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్ స్పష్టం చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో మంత్రి మాట్లాడారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి నాయకులంతా ఇప్పటి నుంచే కృషి చేయాలన్నారు. ఎన్నికల అనంతరం గ్రామాల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. రబీలో సాగు చేసే పంట పొలాలకు సాగు నీరందించేందుకు సంబంధిత ఉన్నత అధికారులతో ఇప్పటికే మాట్లాడినట్లు తెలిపారు. శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు, దేవాదుల ప్రాజెక్టుల ద్వారా సాగునీరందించి పంట పొలాలను సస్యశ్యామలం చేయనున్నట్లు వెల్లడించారు. గత పది సంవత్సరాలుగా గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడిందన్నారు. రోడ్లు, గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం, తాగునీటి సమస్య, బస్సు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల ఆధారంగా పలు సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. నిత్యం పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు ఎలిగేటి ఇంద్రసేనారెడ్డి, సింగిల్ విండో మాజీ చైర్మన్ గోలి రాజేశ్వర్‌రావు, నాయకులు సుకినె సంతాజీ, దాట్ల రాముడు, చల్లా రవీందర్‌రెడ్డి, హింగె శ్రీకాంత్, శనిగరం వెంకటేష్, బొల్లె పోగు రమేష్‌బాబు, స్వరూప, పుష్ప, ముప్పు మహేందర్, సుమన్‌గౌడ్, సురేందర్, బాబురావు, అనిల్‌కుమార్, రమేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, మండల కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ముగ్గురి ఆత్మహత్య

- ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఘటనలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే.. ముగ్గురు ఆర్థిక ఇబ్బందులతోనే తనువు చాలించారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. బంధువులు కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి.

రైలు కిందపడి యువకుడు..


రాజు మృతదేహం

గార్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మానుకోట జిల్లా గార్ల రైల్వేస్టేషన్ సమీపంలోని డబ్బాలమోరీ వద్ద చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గార్ల మండలం గుంపెళ్లగూడెం గ్రామానికి చెందిన కల్లెం రాజు(26) ద్విచక్ర వాహనంపై తిరుగుతూ గ్యాస్‌స్టౌవ్‌లు మరమ్మతులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గ్యాస్‌స్టౌల మరమ్మతులతో వచ్చిన డబ్బులతో కుటుంబ పోషణ భారంగా మారడంతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. డిప్యూటీ స్టేషన్ మాస్టర్ పంకజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి పంచనామా నిర్వహించి, మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు రైల్వే ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. మృతుడికి భార్య ఇద్దరు చిన్నపిల్లలు ఉన్నారు.

సంతాలాల్‌పోడు తండాలో..

బయ్యారం: అప్పులు చేసి మద్యానికి అలవాటు పడిన ఓ యువకుడు అప్పులు భారంతో పురుగులమందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం మానుకోట జిల్లా బయ్యారం మండలంలోని సంతాలాల్‌పోడుతండాలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ అంజి(24) కారు డ్రైవర్‌గా పనిచేస్తూ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో మద్యం కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేకపోవటంతో వారం క్రితం పురుగుల మందు తాగగా కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం మహబూబాబాద్ జిల్లా ఆస్పత్రిలో చేర్పించారు. ఈక్రమంలో పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై ఉపేందర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గాంధీనగర్ కాలనీలో..

కాజీపేట: హనుమకొండ జిల్లా కాజీపేట 48వ డివిజన్ దర్గా కాజీపేట శివారులోని గాంధీనగర్ కాలనీకి చెందిన ఎస్‌కె యాకుబ్ (41) కుటుంబ ఆర్థిక పరిస్థితి క్షీణించడంతో ఆందోళనకు గురై ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పు అంటించుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ సార్ల రాజు తెలిపారు. కాజీపేట పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం రాత్రి ఆయన మాట్లాడుతూ.. కార్ వాష్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్న యాకుబ్ సొంత ఇంటి నిర్మాణానికి ఫైనాన్స్ తీసుకున్నాడు. ఈక్రమంలో వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో సకాలంలో కిస్తీలు చెల్లించలేక సతమతమయ్యాడు. కుటుంబ సభ్యుల సహకారంతో ఫైనాన్స్ అప్పులు చెల్లించినప్పటికీ ఆర్థిక ఇబ్బందులు ఎక్కువ కావడంతో మనోవేదనకుగురై ఆత్మహత్య చేసుకున్న భార్య షేక్ థైసిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నట్లు సీఐ తెలిపారు.

కామర్స్‌లో ప్రతి విద్యార్థికి మూడు మార్కులు



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఇటీవల జరిగిన బీకాం ఐదో సెమిస్టర్ మూడో పేపర్‌లో ఈ కామర్స్ సబ్జెక్టు ప్రశ్నాపత్రంలో రెండు ప్రశ్నలు ఒకేవిధంగా ఇచ్చారు. దీంతో విద్యార్థులు ఆందోళనకు గురయ్యారు. ఈ విషయం పరీక్షల విభాగం దృష్టికి చేరడంతో సంబంధిత పాత్యప్రణాళిక అధ్యక్షుడు, అదనపు పరీక్షల నియంత్రణాధికారి వాస్తవమేనని నిర్ధారించారు. దీంతో ప్రతి విద్యార్థికి మూడు మార్కులు అవార్డు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు శుక్రవారం పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య మల్లారెడ్డి వెల్లడించారు. ఇదిలా ఉండగా.. ప్రశ్నాపత్రంలో తప్పిదానికి సంబంధించి నిబంధనల ప్రకారం సంబంధిత ఉద్యోగులపై కూడా చర్యలు ఉంటాయని తెలిపారు.

డాక్టర్‌పై చర్య తీసుకోవాలి

- తల్లి గర్భంలో శిశువు మృతికి వైద్యుల నిర్లక్ష్యమే కారణమని ఆరోపణ
- జిల్లా ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, డీఎస్పీ నాయకుల ధర్నా


ఆస్పత్రి ఎదుట ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు, డీఎస్పీ నాయకులు

నర్సంపేట రూరల్: తొమ్మిదినెలలు నిండిన గర్భవతికి ఉమ్మనీరు పోతుందని ఆస్పత్రికి తీసుకురాగా సమయానికి వైద్యురాలు అందుబాటులో లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది చూడడంతో గర్భంలోనే శిశువు మృతిచెందిందని, వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని సంగాల శివకృష్ణ డిమాండ్ చేశారు. నర్సంపేట పట్టణంలోని జిల్లా ఆస్పత్రి ఎదుట కృష్ణ కుటుంబ సభ్యులు, ధర్మసమాజ్ పార్టీ నాయకులు శుక్రవారం ధర్నా చేపట్టారు. అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ గోపాల్‌తో మాట్లాడి వినతిపత్రాన్ని అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని వల్లభ్‌నగర్‌కు చెందిన సంగాల శివకృష్ణ భార్య సంగాల మమలత గర్భవతి. 2023డిసెంబర్ 30న సాయంత్రం 6గంటలకు రక్తస్రావం, ఉమ్మనీరు పోతుండగా నర్సంపేట జిల్లా ఆస్పత్రికి తీసుకొచ్చారు. ఆసమయంలో డ్యూటీలో ఉండాల్సిన గైనకాజిస్టు సునీతారెడ్డి అందుబాటులో లేకపోవడంతో తగిన సమయంలో వైద్యం అందించలేకపోయారు. దీంతో 31వ తేదీన తెల్లవారుజామున 3గంటలకు తల్లిగర్భంలోనే శిశువు మృతిచెందింది. డాక్టర్ నిర్లక్ష్యం మూలంగానే మా శిశువు చనిచెందిందని, తక్షణమే ఆ వైద్యురాలని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజ్‌కుమార్ అక్కడకు చేరుకొని బాధితులతో.. ఆస్పత్రి సూపరింటెండెంట్‌తో మాట్లాడారు. సమస్య ఉంటే ఆందోళన విరమించి సూపరింటెండెంట్‌తో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఎస్సై సూచించడంతో ఆస్పత్రి సూపరింటెండెంట్ గోపాల్‌తో మాట్లాడి వినతిపత్రాన్ని అందించారు. ఈ విషయంపై డాక్టర్ గోపాల్‌ను వివరణ కోరగా సంగాల మమలత ఆస్పత్రికి వచ్చిన సమయంలో డ్యూటీ డాక్టర్ ఆస్పత్రిలోనే ఉన్నారని, ఆరాత్రి మూడు సార్లు పేషెంట్‌ను డ్యూటీ డాక్టర్ పరిశీలించారని తెలిపారు. పేషెంట్‌కు ఉమ్మనీరు పోతున్నది వాస్తవమేనని, రక్త స్రావం కాలేదని, దీంతో నార్మల్ డెలవరీ కోసం వైద్యురాలు ప్రయత్నించారని పేర్కొన్నారు. రక్తస్రావం అయితే వెంటనే ఆపరేషన్ చేసేవారని, ఈలోగానే తల్లి గర్భంలో శిశువు గుండె ఆగిపోయిందని వివరించారు. ఈ ఘటన వైద్యురాలి నిర్లక్ష్యం ఏమిలేదన్నారు. అయినప్పటికీ ఈ ఘటనపై పూర్తి స్థాయిలో విచారణ చేస్తామని, వైద్యురాలి నిర్లక్ష్యం ఉంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

గుప్తనిధుల కోసం తవ్వకాలు?

ఆత్మకూరు: హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలంలోని పెద్దాపూర్ శివారులో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిగినట్లు మండలంలో శుక్రవారం జోరుగా ప్రచారం జరిగింది. స్థానికంగా ఉండే కొందరితోపాటు వరంగల్‌కు చెందిన పలువురు ముఠాగా ఏర్పడి మట్టి తవ్వకాల పేరుతో గుప్త నిధుల వేట కొనసాగిస్తున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. కాగా, ఈ విషయాన్ని స్థానికులు పోలీసుల దృష్టికి కూడా తీసుకెళ్లినట్లు తెలిసింది. దీంతో పోలీసులు నలుగురిని అదుపులోకి తీసుకుని వారు ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ముఠాలో మరో నలుగురు పరారైనట్లు తెలిసింది. ఇదే విషయంపై పోలీసులను వివరణ కోరగా.. ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.